# అనగనగా... ఒక కథ

# ఆబ్దీకం

**"పద్దెనిమిదో తారీఖు నుంచి ఇరవై రెండో తారీఖు వరకూనా"**

**"అవును సార్..ఐదు రోజులు"**

**"ఇవ్వాళ తారీఖెంత? ఆ..ఫిఫ్త్. ఇంకా తర్టీన్ డేస్ వుంది. ఓకే..ఏంటి...ఇంత ప్రీ ఇంటిమేషన్...ఎనీ గుడ్ న్యూస్? పెళ్లిచూపులూ..గట్రా..ఎట్సెట్రానా?"**

**"కాదు సార్..పద్దెనిమిదిన మా ఫాదర్ సెర్మనీ"**

"ఓ...సారీ! ఆ..చూడు మిస్టర్ భార్గవా..ఏం పెండింగ్ ఉంచకుండా..వర్క్ కంప్లీట్ చెయ్యి. సుందరానికి నీ వర్క్ పొజిషన్ చెప్తే హెల్ప్‌ఫుల్‌గా వుంటుంది."

"ఓకే సార్"

'అమ్మయ్య' అనుకుంటూ బైటపడ్డాడు భార్గవ బాస్ రూమ్‌లోంచి.

అన్నయ్య ఫోనందాక..రెండ్రోజులు ఓవర్ ఏక్టివ్‌గా వర్క్‌చేసి, ఓవరేక్టన్తో బాస్‌కి సబ్మిట్ చేసి..ఓకే గుడ్ అనిపించుకుని..ఫైల్లు తీసుకొస్తూ లీవ్ లెటర్ ముందు పెట్టాడు-వర్కౌట్ అయింది.

ఆర్నెల్లయింది ఈ వూరొచ్చి..

అమ్మని చూసి నూట డెభై ఎనిమిది రోజులు అయింది.

ఇంట్లో ఫోనుంటే ఎంత బావుణ్ను-కనీసం ఫోన్లో అయినా మాట్లాడేవాణ్ని అని తల్లిని తలపోసుకుని డల్ అవుతున్నాడు భార్గవ.

ఇంకెంత..తర్టీన్ డేస్!

అమ్మ తప్ప అన్యం తెలియని..ఆదరణతో పాతికేళ్లు గడిపాడు భార్గవ.

హైదరాబాద్‌లో ఉద్యోగం-ఉద్యోగం వచ్చినందుకు ఆనందమేగానీ..అమ్మని విడిచి వెళ్లాలంటే బెంగగా అనిపించింది. అమ్మకీ తనకన్నా బెంగ వుందేమో గానీ...ఓర్చుకుని...ఓదార్చి...సామాన్లన్నీ సర్దిపెట్టింది-ఏడుపొస్తోంది-భార్గవకి.

వెళ్లేముందు ఎప్పుడూ లేనిది ఆవిడ కాళ్లకి దణ్నం పెట్టబోయాడు. టక్కున లేవనెత్తింది.

"దణ్నం నాకు కాదురా..మీ నాన్నకి పెట్టు" అంది ఆవిడ.

దండ వేసిన ఫోటోఫ్రేమ్‌కి దండం పెట్టాడు భార్గవ.

నాన్న ఫోటో ఆశీర్వదించిందో లేదో కనిపించలేదు. కన్నీళ్లు అడ్డొచ్చాయి భార్గవకి.

రిక్షా ఎక్కాడు-అమ్మనే చూస్తున్నాడు. గచ్చకాయరంగు చీర..నల్లటి స్టిక్కరు అంటించుకున్న నుదురు- నీళ్లాపుకుంటున్నట్లు తెల్సిపోతున్న తెల్లబడుతూన్న నల్లని కళ్లు-గుమ్మందాకా వచ్చి "వేళ పట్టున తిను..వెళ్లగానే ఉత్తరం రాయి-ఎప్పుడు సెలవొచ్చినా ఓసారి రా..నీ రూము వెసులుబాటుగా ఉంటే నేనొస్తాలే-డబ్బుకిబ్బంది పడకు-ఏం కావాల్సినా రాయి" ఇలా పొడి పొడి మాటల్తో ప్రేమచల్లి పంపించింది. ఆ చూపూ-ఆవేల్టి ఆవిడ ఆకారం నించున్న తీరూ మనస్సులో ఫిక్స్ అయిపోయి...మళ్లీ మళ్లీ రమ్మని పిలుస్తున్నట్లు జ్ఞాపకం వస్తున్నాయి భార్గవకి.

వారానికి రెండుత్తరాలు తను రాస్తాడు. అమ్మ నాలుగో అయిదో ఖచ్చితంగా రాస్తోంది.

ఇంకెన్నాళ్లు...పదమూడు రోజుల్లో అమ్మ దగ్గర ఉంటాడు. కౌంట్‌డౌన్ స్టార్టయింది. రోజులు మైనస్ చేసుకుంటున్నాడు.

నాన్న తద్దినం-ఎంత మంచిది కాదనుకున్నా..ఓ రకంగా మంచి అకేషను..అన్నయ్యల్నీ వదినల్నీ పిల్లల్నీ అందర్నీ..చూడచ్చు అని మురిసిపోతున్నాడు భార్గవ.

లీవ్ సేంక్షన్ అయింది కనక...టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకోవాలి. సాయంత్రం ఆఫీసు నుంచి వెళ్తూ వెళ్తూ రాజమండ్రికి 17వ తేదీ రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్టుకొనాలి-పదమూడు రోజులుంది గనక ఈజీగానే దొరుకుతాయి..భార్గవ ఆలోచనలు పదమూడు రోజులు ముందుకు వెళ్తున్నాయి. ఎవరికేం కొనుక్కు వెళ్లాలో పట్టికెళ్లాలో ప్లాన్లు చేసుకుంటున్నాయి-తను పట్టుకెళ్లిన వస్తువులు చూసి వాళ్లెంత సంతోషపడతారో..ఊహలకి అందుతున్నాయి.

★ ★ ★

కౌంట్‌డౌన్ స్టార్టయి 12 రోజులు అయింది. కొనాల్సినవన్నీ కొన్నాడు. రేపే ప్రయాణం-ఎల్లుండీపాటికి రైలు దిగి..బస్సెక్కి తన వూరుకి వెళ్తాంటాడు.

కలలు ఊహలు కలగాపులగంగా అల్లరిపెట్టి వళ్లెరగని నిద్ర ఇవ్వట్లేదు-ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదుగానీ లేచాక టైమ్ చూస్తే ఎనిమిది కావస్తోంది..అమ్మో అనుకుంటూ..పక్కమీంచి లేచాడు.

ఎనిమిదయినా వెలుగు అయిదున్నర అయినట్లుంది.

ఆకాశం ముసురేసింది..అందుకే మెలుకువ రాలేదన్నమాట అనుకున్నాడు భార్గవ.

సూర్యుళ్లా తయారయి భార్గవ ఆఫీసుకి వెళ్లాడు యాక్టివ్‌గా. తనే ముందు

**ఆబ్దీకం ముందురోజు రాత్రి- ఆబ్దీకమైన రాత్రి భోజనం చేయకూడదు. ఏదైనా టిఫెనో పళ్లో తీసుకోవాలని అంటారు. శ్రద్ధగా పెట్టేదే శ్రాద్ధం- ఆ నమ్మకాన్ని మనం నమ్మితే మన తర్వాత తరాలు కూడా నమ్ముతాయి. చనిపోయిన రోజైనా పెద్దలను తలుచుకుని మంత్రోక్తంగా నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని కళ్లకద్దుకు తినటం వల్ల నిర్వహించే పిల్లలూ, అందుకునే పితృదేవతలూ కూడా పుణ్యం పొందుతారుట.**



వెళ్లాడు- అందరికీ మబ్బే మసకేసింది- ఆలస్యంగా వచ్చారు-భార్గవ తనపని తాను చేసుకుంటూండగా ఇన్‌లాండ్ లెటరు తెచ్చిచ్చాడు అటెండర్.

అమ్మ దగ్గర్నుంచే..!!

ఆత్రంగా విప్పి చదువుతున్నాడు.

"చిరంజీవి భార్గవా-సెలవుదొరికిందనీ...18వ తేదీకి నువ్వు వస్తున్నావని మేమందరం ప్రేమగా ఎదురుచూస్తున్నాం..అన్నయ్యలూ పిల్లలూ నిన్ననే వచ్చారు. ఇల్లంతా బలే సందడిగా వుంది. అక్కయ్యా పిల్లలూ 16న వస్తారట-మీ నాన్నగారు ఇల్లెప్పుడూ ఇలా కళకళలాడుతూ వుండాలని కోరేవారు కదా! ఆయన జ్ఞాపకం రోజైనా..ఇలా అందరూ కలుసుకోవటం ఆయనకీ మనకీ ఆనందంగా వుంటుంది-అసలీ కథలూ కార్యాలూ పండగలూ తద్దినాల్లో..పరమార్థం ఇలా నలుగురూ కలుసుకోవడమే. అందరూ కల్సి ఆయన్ని తల్చుకుందాం..జాగ్రత్త! రైల్లో అన్నం తినకు. ఆబ్దీకం ముందు రోజు రాత్రి- ఆబ్దీకమైన రాత్రి భోజనం చేయకూడదు. ఏదైనా టిఫెనో పళ్లో తీసుకోవాలని అంటారు. శ్రద్ధగా పెట్టేదే శ్రాద్ధం- ఆ నమ్మకాన్ని మనం నమ్మితే మన తర్వాత తరాలు కూడా నమ్ముతాయి. చనిపోయిన రోజైనా పెద్దలను తలుచుకుని మంత్రోక్తంగా నైవేద్యం పెట్టి ఆ ప్రసాదాన్ని కళ్లకద్దుకు తినటం వల్ల నిర్వహించే పిల్లలూ, అందుకునే పితృదేవతలూ కూడా పుణ్యం పొందుతారుట.

మీ నాన్న పోయినట్లే మర్చిపోయి బతుకుతున్నానుగానీ ఈరోజుని మరచిపోలేక పోతున్నాను-

నేను ఆయన దగ్గరకెళ్లేదాకా ఈ జంఝాటం తప్పదు- ఆశీస్సులతో..

మీ అమ్మ"

ఉత్తరం పూర్తి చేశాక..భార్గవకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అలాంటి ఉత్తరం తల్లి రాయాల్సి వచ్చినందుకు బాధపడ్డాడు.

ఆమె ఎంత బాధ దిగమింగుకుని ఆ ఉత్తరం రాసిందో అర్థం చేసుకుని మరీ బాధ పడ్డాడు.

సాయంత్రానికి కూడా సూర్యుడు రాలేదు.

సిటీలో అక్కడా వాన కూడా పడుతోంది అని ఫోనుల్లో తెలుస్తున్నాయి. ఆఫీసు నుంచి బైల్దేరేటప్పటికి భయంకరమైన వాన-ఇంటికెళ్లేటప్పటికి తడిసి ముద్దయిపోయాడు.

* * *

బంగాళాఖాతంలో వాయుగుండం.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీవ్రమైన తుపాను.

పేపర్లో రేడియోల్లో హెచ్చరికలు ప్రకటించాయి.

'అయ్యో..' అనుకున్నాడు భార్గవ.

తన వాళ్లు ఎలా వున్నారో? అనుకున్నాడు.

రాత్రి తన ప్రయాణం..?

రైళ్లూ బస్సులూ అన్నీ బంద్ అయిపోయాయి.

టెలిఫోన్స్ కట్!

తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు మిగిలిన ప్రదేశాల నుంచి రవాణాలు కోల్పోయాయి-వైర్లతో నడిచే..వెలుగు- శబ్దం- తదితరాలన్నీ తెగి లుంగ చుట్టుకుంటూ కొట్టుకుపోయాయిట.

భార్గవకి భయం వేసింది-

బెంగ పుట్టింది- హైదరాబాద్ పొడిబారింది.

సూర్యుడు కూడా పొడిచాడు.

ఆఫీసు నుంచి 5 నిమిషాలకోసారి రైల్వే ఎంక్వయిరీకి ఫోను చేస్తున్నాడు..రైళ్లు కదలవని కరాఖండీగా చెప్తున్నారు.

బస్‌స్టాండ్..బాబోయ్ అంది!

చివరిక్షణం వరకూ ప్రయత్నం చేసాడు.

ఏం చేస్తాడు??

రిజర్వేషన్ కేన్సిల్! డబ్బేం కట్టవలేదు- పరిస్థితి అలాంటిది-గౌతమి ఎక్స్‌ప్రెస్ హాయిగా నిద్దరోయింది.

ఇంటికెళ్లిన భార్గవకే..నిద్దరలేదు..

* * *

ఉదయం ఆరుగంటలు-

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్లో ఆనంద భవన్ హోటల్ ముందు ఆటో ఆగింది.

తడి పొడిగా ఉన్న పంచెమీద చిరుతడిగా వున్న లాల్చీ తొడుక్కున్న ఓ వ్యక్తి..ఆటోవాడికి డబ్బులిచ్చి పంపేసి అరక్షణం ఆగి ఆలోచనలో ఉన్నాడు..అతడే భార్గవ. ఆనందభవన్ ఎదురుగా ఎన్నో షాపులు..ఇంకా తెరవని షట్టర్లు..ఆ షాపులముందు అరుగులమీద అరుగుకి నలుగురు చొప్పున బ్రాహ్మలు!

పనిచ్చేవాడి పిలుపుకోసం ఎదురు చూస్తున్న దినవారి కూలీల్లా కూచున్నారు.

ఆ బ్రాహ్మలందర్నీ పరిశీలనగా చూశాడు భార్గవ.

అందులో ఒక వ్యక్తిని చెయ్యూపి పిలిచాడు- ఆ బ్రాహ్మడు ఆత్రంగా రోడ్‌క్రాస్ చేసి వచ్చాడు.

"టిఫెన్ చేశారా" అడిగాడు భార్గవ.

అడ్డంగా తలూపాడు ఆ బక్కచిక్కిన బ్రాహ్మడు. అతని కళ్లలోకి సూటిగా చూస్తే నిజమే అనిపించింది భార్గవకి.

"రండి..టిఫెన్ చేద్దామా?"

ఆయన ఆశగా-ఆబగా..కాదు, ఆకలిగా ఒప్పుకున్నాడు.

భార్గవ ఆయన్ని తీసుకెళ్లి ఓ టేబుల్ ఎదురు సీట్లో కూర్చోపెట్టేడు.

సర్వర్ వచ్చాడు-

"నాలుగు ప్లేట్లు వడ-సాంబారొద్దు-నాలుగు చట్నీలు తీసుకురా" భార్గవ కంఠంలో కమేండో..కమిట్‌మెంటో-

"యస్ సార్" అనుకుంటూ సర్వర్ వెళ్లిపోయాడు.

"ఇవ్వాళ మా నాన్నగారి ఆబ్దీకం. మీకు కావాల్సినన్ని గార్లు తినండి! ఉల్లిపాయ వద్దని సాంబారు తీసుకురావద్దన్నాను" అన్నాడు భార్గవ.

బ్రాహ్మడి కళ్లలో తడి చేరింది.

ప్రొఫెషనల్‌గా ఎన్నో ఆబ్దీకాలకి భోక్తగా వెళ్లాడు. ఇది కొత్త రకం..అతని భక్తిశ్రద్ధల్ని మనసారా మెచ్చుకున్నాడు బ్రాహ్మడు.

అతను గారెలు తిన్నాక దణ్ణం పెట్టి 51 రూపాయలు ఇచ్చాడు భార్గవ.

ఆ బ్రాహ్మలాయన దక్షిణ తీసుకునేముందు..

"మీ తండ్రిగారి పేరూ గోత్రం చెప్తారా?" అని అడిగాడు..చెప్పాడు భార్గవ.

భార్గవకి ఇప్పుడు తృప్తిగా వుంది. ఒక ప్లేటు వడ ఆర్డర్ చేసి కళ్లకద్దుకుని తిన్నాడు...నాన్నని తలుచుకుంటూ, తన వాళ్లంతా బాగుండాలి అనుకుంటూ.

✻

